# హృదయాల్ని తడిమే గడియారం

## - శ్రీరామకవచం సాగర్

### 2011 ఫిబ్రవరి 21 వ తేదీ ఆంధ్రజ్యోతి వివిధ లో ప్రచురితమయిన వ్యాసం

కాట్రగడ్డ దయానంద్ ఓ వర్తమాన గడియారం! ఆచి తూచి అతని మనస్సు స్పందిస్తుంది. వస్తుత: కవి! ఆపైన ఓ రైతు బిడ్డ. కథల్లోనూ అతనో కవిగానో, రైతుగానో- కన్పించడు. ఓ న్యాయ నిర్ణేతగా, ఎంతో బ్యాలెన్స్‌గా, తూకంతో అతని మాటలు మనకి కథలు చెప్తాయి. ఎక్కడా దేనికీ లొంగని ఓ సున్నిత మనస్తత్వం అతనిది. అతనిలోని సమతూకంతో దేన్నైనా ఎదిరించే మనస్తత్వం, పోనీలే అని క్షమించే ఓ రైతు బిడ్డ ఇంట్లోని- ఆవు చూపుల మృదుత్వం మనకి కన్పిస్తుంది!

ఎంత మెత్తటివాడో, అంతటి గట్టివాడు! కథల్లో వామనావతారం ఎత్తినవాడు. తెలుగులో ఓ బ్యాలన్స్‌డ్ కథకుడు దయానంద్. ఓ రైతు కుటుంబం భూమి చూట్టూతా ఎలా పెనవేసికు పోతుందో ఆయన కథల్లో మనం గ్రహించవచ్చు. ఆక్వా పొలాలు దయానంద్ వారసత్వ మట్టిని ఎంతగా వెక్కిరించాయో నాకు స్వయంగా తెలుసు.

***

ప్రేమ్‌చంద్‌ని దయానంద్‌ని పక్కపక్కన కూర్చోపెడితే కొన్ని పోలికలు ఆశ్చర్యం కలిగిస్తాయి. తెలుగు సాహిత్యంలో ప్రేమ్‌చంద్ వారసుడిగా దయానంద్ కథల్ని పరిశీలించాల్సిన అవసరం వర్తమాన పరిశోధకుల మీద ఎంతో వుంది. ఇవాళ తెలుగు కథ రైతు బిడ్డలు బతికున్నంత కాలం ఏ శ్వాస పీలుస్తుందో అది దయానంద్ కథల్లో సాహిత్య పరిశోధకులూ, విమర్శకులూ వెతుక్కోవచ్చు. రైతు భార్యల గడప దాటిన దైన్యాన్ని, బలహీనతనీ- ఆయన క్షమించి కథ చెప్పే తీరులో సెక్స్‌ని వెతుక్కొనే విమర్శకులు చాలా బలహీనులు.

పరోక్ష కథా సంవిధానం దయానంద్ ప్రతిపాదిస్తాడు. వాళ్ల తప్పులని హృదయ విదారకంగా రోదిస్తా తెర చాటున ఎలా దాచిపెడ్తాడో చూస్తే నాకు చాలా ఆశ్చర్యమేస్తుంది. కోడలుని తట్టిలేపి అర్ధరాత్రిన మొగుడు దగ్గరికి పొమ్మనే అత్తమ్మల ఆప్యాయతా దృశ్యాలు దయానంద్ మాత్రమే రాయగలడు. ఆయన రాసిన ప్రతి కథా నాకు ఇప్పటికీ గుర్తు ఉన్నాయంటే కథకుడిగా ఆయన కథల విజయ కేతనం ఓ సాహిత్య యుద్ధ క్రతువుని తలపింపజేస్తుంది. ఎదురుగ్గా రైతులు వాడిపోతున్నాక, రైతుల పక్షాని బలరాముడిగా మనకు దయానంద్ ఎదురు వచ్చినప్పుడు ఈ నేల ఆయనకినమస్కరిస్తుంది.

***

కథలు చెప్పటంలో ఆయన ఎక్కడా శృతిమించడు.పాత్రలు మాత్ర మే మనల్ని నిశ్చేష్టుల్ని చేస్తాయి. ఆయన కథల్లో

తనో పరాయివాడు గా వుంటూ, పాత్రల్లోకి ప్రవేశించి మనల్ని అగాధాల్లోకి తోసేస్తాడు. ఇది జీవితం అని ఆయన ఊరుకోడు. ఇదీ ఓ జీవితమేనా అని ఆయన చెప్పడు. ఇలా ఉంది జీవితం! ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటని ఓ బైరాగిలా నిష్క్రమిస్తాడు. ఆయన కథల వెనుక యధార్థ వ్యధలు కోకొల్లలు. గ్రామీణ జీవితం నుంచి బాతులమ్మి నడకల కూని రాగాలు, గ్రామీణ స్త్రీల కోకల వాసనలు ఆయన మనకి నివేదిస్తాడు.

ఒకోసారి కార్మికుడిగా మైకా గనుల్లోకో, చీమకుర్తి క్వారీల్లోకో తీసికెళ్లి ఆ బండరాళ్ల మధ్య నలిగిన హృదయాలను ఏరుకొచ్చి ఏడిచే దయానంద్ కథలు, వాన్‌పిక్ కోరల్లోకి నడిపించి ఓ ఉద్యోగి తటస్థ దైన్యాన్ని, పరాయీకరణనీ, గ్రామాన్ని విడిచి బైటకి రాలేని ఉద్యోగి మనస్తత్వాన్ని కళ్ల ముందు నిలబెడ్తాడు. వాన్‌పిక్ హృదయ విదారకతని ఓ దృశ్యమానం చేసిన ఆయన కథని (మనిషీ- మట్టి) నేను చదివి ఇదో గొప్ప కథ అన్నా చలించక, అది రాయటంలో నా బలహీనతలు వున్నాయన్న- తిరిగి చూసుకొనే రచయిత మనస్తత్వాన్ని మనస్సులోనే అభినందించాను.

సంయమనం కథకి ప్రాణం! కథకుడికి సం యమనం వుంటే ఆ కథ ఇంకా రాణిస్తుంది! దారి తప్పిన జీవాలని వెతుక్కొనే రైతు బిడ్డగా ఆయన కథల్లో వుండడు. మనల్ని ప్రవేశింపజేస్తాడు.

***

'గుండ్లకమ్మ తీరాన' కథల సంపుటి ముందుమాటలో- 'ఇప్పుడు రాస్తున్న రచయితలందరూ పోస్ట్ మోడర్నిస్టులే (వాళ్ల ప్రమేయం లేకుండానే) అంటున్న డా.వి.చంద్రశేఖరరావుతో ఏకీభవించక తప్ప దు. ప్రస్తుతం మన రచయితలంతా తమ ప్రమేయం లేకుండానే వర్తమాన బీభత్స దృశ్యాలని గుర్తించి వాటిని సందర్భానుసారం ఏకరువు పెట్టడం ద్వారా పోస్ట్‌మోడర్నిస్టు సాహిత్య వాతావరణంలోకి అనివార్యంగా నెట్టబడుతున్నారు.

ఇది వర్తమాన విమర్శకులు గుర్తించటంలేదు. దీనిమీద ఎంతో చర్చ జరగాల్సివుంది. కాట్రగడ్డ దయానంద్ తన 'పండుటాకు' కథల సంకలనంలో గాని వర్తమాన 'గుండ్లకమ్మ తీరాన' సంపుటిలో కథలు గాని వర్తమాన దు:ఖ వాతావరణాన్ని దృశ్యాలు దృశ్యాలుగా విప్పటానికి చేసిన అతి సున్నితమైన మేధో చర్యని అభినందించక తప్పదు. వర్తమాన వాతావరణాన్ని గుర్తించటంలోని ఓ అన్వేషకుడిగా, చారిత్రక సందర్భం నెడ్తున్న అనివార్యతలని సరిగ్గా పట్టుకున్న పరిశీలకుడిగా దయానంద్ మనముందు సరిగ్గా యిక్కడే ఓ అసలైన న్యాయనిర్ణేతగా ప్రత్యక్షమవుతాడు.

మరోసారి ఓ ప్రేక్షకుడిగానూ ఆయన మన కళ్లముందు మెదుల్తాడు. అందుకే గత మూడు దశాబ్దాల కథల విస్తృతిని, కథల లోతు నీ మునుముందుకు తీసుకెళ్లిన వర్తమాన రచయితల్లో దయానంద్ ముందు వరుసలో నిలబడ్తాడు. గత మూడు దశాబ్దాల సంక్షుభిత చారిత్రక నేపథ్యంలో మనం ఏమి కోల్పోయామో దయానంద్ కథలు ఓ అద్భుత డాక్యుమెంట్స్‌గా, జ్ఞాపకాలుగా నిరూపిస్తాయి. ఏ భావా లు, ఏ సంఘటనలు మన జీవితంలో తారసపడి మనల్ని

దొంగచాటుగా లొంగదీసుకుంటున్నాయో,వాటిని ఒడుపుగా పట్టి కథలు రాసి న వాళ్లని వేళ్లమీద లెక్కబెట్టవచ్చు.

ఆ క్రమంలో దయానంద్ పాత్ర కథకుడిగా ఎంతో అభినందించదగ్గది. పదికాలాలపాటు పెన్నాడే కథ లు రాసిన వాళ్లలో దయానంద్ ఒహడిగా సాహిత్య చరిత్రలో యిప్పటికే ఎంతో గుర్తింపు తెచ్చుకున్నాడు. అందుకు ఆయన రైతుబిడ్డ కావటమే కాదు, రైతు పక్షపాతిగా ఎక్కడ నిలబడాలో తెల్సుకోవటంలోని చారిత్రక కర్తవ్యాన్ని సరిగ్గానే నెరవేరుస్తున్నాడు.

ఆయన పాత్రలు ఏ రాజకీయాలు మాట్లాడవు. గాంధీలా సత్యాగ్రహం చేస్తాయి, దండయాత్ర చేస్తాయి. ఆయన కథల్లో ఎక్కడా దుస్సాహసికులు, సూసైడ్ పాత్రలు గానీ దాదాపు కన్పించవు. ఈ దేశంలో మేమూ ఓ మనుష్యులమే - అని చెప్పే మట్టి బిడ్డలు కాదు, మట్టి బెడ్డలు చూస్తా విలపించే భారతీయ ఫక్తు గ్రామీణ వాతావరణం కన్పిస్తుంది.

సరిగ్గా ఇక్కడే ప్రేమ్‌చంద్ వారసుడిగా దయానంద్ నిలబడ్డాడు. ప్రేమ్‌చంద్ మాదిరే ఓ సంయమన రచయిత కాట్రగడ్డ దయానంద్.ఆయన పుట్టిన 'అమ్మనబ్రోలు' గ్రామం ఆయన తిరగాడిన నేలల మట్టివాసన ఆయన కథల్లో గుబాళిస్తుంది. ఆ మట్టి తడి చరిత్రని ఓ గగుర్పాటుతో ఓ బరువు గుండెతో నిలబడి ఆయన కథలు చదివి నిశ్చేష్టులం అవుతాం.

కవితల మాదిరి తక్షణ సంఘర్షణలకి వెంటనే స్పందించి కథలు రాసే ఒడుపుని కూడా కాట్రగడ్డ దయానంద్ సంతరించుకోవటంతో కొన్ని వర్తమాన సంఘటనలు కొన్ని అద్భుత కథలుగా 'అలజడి, నేల తిమ్మిరి, గుండ్లకమ్మ తీరాన, అతడు- ఆమె- ఒక స్వప్నలోకం, పండుటాకు, శిశిరం, నీడ, మనిషి- మట్టి, ఆకురాలు కాలంలోకి' లాంటి కథలు ఆయన మాత్ర మే రాయగలిగాడు. మనస్సు ఒగ్గపెట్టుకొని, ఓ గొప్ప దు:ఖంతో కథలు అల్లగలిగాడు. ఇటీవలే వచ్చిన ఆయన 'గుండ్లకమ్మ తీరాన' కథల సంపుటిగాని, నాటి 'పండుటాకు' కథల సంపుటిగాని మరెన్నో మంచి కథల్ని ఆయన రాయగలడనే భరోసాని యిస్తున్నాయి. ఇది తెలుగు కథకి మరింత ప్రాభవాన్ని తెచ్చిపెడుతుందని ఆశించవచ్చు. ఇందుకు కాట్రగడ్డకి జేజేలు!

- శ్రీరామకవచం సాగర్

98854 73934

(కాట్రగడ్డ దయానంద్‌కి కొలకలూరి భాగీరధీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా..)